# ఆటో కార్మికుల అలుపెరుగని పోరాటం

**- ఆటోలకు పార్కింగ్,ఆటో కార్మికుల సమస్యలపై సిఐటియుతో కలిసి ఆందోళనలు.**
**- 10 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ.**
**- లేకపోతే 11వ రోజు ఎంపీడీఓ కార్యాలయం ముందు రిలే దీక్షలు చేపడతామన్న ఆటో కార్మికులు.**
**- సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ఆధ్వర్యంలో పోరాటం.**

కుక్కునూరు మెయిన్ సెంటర్‌లో ఆర్ & బి పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని, అక్రమంగా నిర్మించిన షాపుల వల్ల ఇటు ఆటో కార్మికులు,అటు ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు.మండలకేంద్రం కావడంతో కుక్కునూరు సెంటర్ లోని ఆ షాపులకు పలు గ్రామాలనుంచి వచ్చే కస్టమర్లను తీసుకురావడం,తిరిగి వారిని క్షేమంగా తీసుకువెళ్లడం పరిపాటిగా మారింది.ఆ విధంగా వచ్చిన డబ్బులతోటే ఆటో కార్మికుల కుటుంబాలు కడుపునింపుకుంటున్నారు. ఆ షాపులకు కస్టమర్లను తీసుకువచ్చే ఆటోలను కాసేపు కూడా నిలవనీయకుండా షాపుల యజమానులు ఇబ్బందులు పెడుతున్నారు.కార్మికుల ఆటోలకు పార్కింగ్ స్థలం లేకుండా వారి జీవనోపాధిని షాపుల యజమానులు అడ్డుకుంటున్నారని ఎవరికి చెప్పినా ఫలితం లేకపోయింది.చివరగా ఆటో కార్మికులు ఆ సమస్యను సిఐటియు దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన సిఐటియు జిల్లా కార్యదర్శి సాయికిరణ్ ఆధ్వర్యంలో వరుస ఆందోళనలకు ఆటో కార్మికులు శ్రీకారం చుట్టారు.

**కార్యాలయాల ముట్టడి...మండల అధికారులకు వినతిపత్రాలు:**



ఆటోలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు,ఆటో కార్మికుల సమస్యల సాధనకోసం సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మండలకార్యాలయాలను ముట్టడించారు.ముట్టడి సందర్భంగా తహాశీల్దార్, ఎంపీడీఓలు ధర్నా స్థలానికి వచ్చి ఆర్ & బి అధికారులు, పంచాయితీ సిబ్బందితో సమన్వయం చేసుకుని 10 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.దీనిపై సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ కుక్కునూరు మెయిన్ సెంటర్‌లో అక్రమంగా నిర్మించిన షాపుల కారణంగా ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యను పరిష్కరించకుండా కాలయాపణ చేయడం సరికాదన్నారు. ఆటోలను నిలిపే స్థలం లేక రోడ్లపైనే నిలపాల్సి వస్తుండటంతో డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిర్ణీత సమయంలో పరిష్కరించకపోతే 11వ రోజు ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆటో కార్మికులతో రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో యూనియన్ అధ్యక్షుడు దారా కృష్ణ, కోశాధికారి శ్రీను, వైస్ ప్రెసిడెంట్లు వీరబాబు, రమేష్, సహాయ కార్యదర్శి యడ్ల సాగర్, ఆటో డ్రైవర్లు శనగ రాము, పెంకే మహేష్, డోనికెన బాలు, మనోజ్, వినోద్, వేల్పుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ బ్రాండ్ పేరుతో గుజరాత్ కల్తీ నెయ్యి..!

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్




విజయ బ్రాండ్ పేరుతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కల్తీ నెయ్యి విక్రయిస్తున్నారంటూ తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.మేఘన ఫుడ్స్ అనే సంస్థకు విజయ డెయిరీ ఫ్రాంచైజీ ఇవ్వగా, మేఘన ఫుడ్స్ గుజరాత్‌లోని కన్హాన్ డెయిరీ నుండి నెయ్యిని సేకరించి తెలంగాణలో విక్రయిస్తున్నారని.. ఈ నెయ్యిలో వెజిటేబుల్ ఆయిల్ కలిసినట్లు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ నివేదిక ఇచ్చిందని అమిత్ రెడ్డి తెలిపారు.విజయ డెయిరీ బ్రాండ్ పేరుతో హైదరాబాద్ మార్కెట్లో నెలకు 100 టన్నులకు పైగా నెయ్యి విక్రయాలు జరుగుతున్నాయని అంచనా ఉందన్నారు.తెలంగాణ విజయ డెయిరీకి ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ....ఏపీకి చెందిన ప్రైవేట్ యూనియన్లు ఇక్కడ తక్కువ నాణ్యత గల పాలను విక్రయిస్తున్నాయని మండిపడ్డారు.దీని బదులుగా ఏపీడిడిసీఎఫ్ కు కేవలం చిన్న రాయల్టీ అంటే లీటర్ పాలు అమ్మకాలపై ఫెడరేషన్‌కు రూ.1 మాత్రమే వస్తుందని.. రైతులకు, కో-ఆపరేటివ్స్‌కు పెద్దగా లాభం లేదన్నారు.దీని వల్ల తెలంగాణ, ఏపీ పాడి రైతులకు రావాల్సిన ఆదాయం గండిపడుతోందని అన్నారు.డెయిరీ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ బ్రాండ్లను వాడుకోవడానికి వీల్లేదని, ఈ విషయమై ఏపీ డెయిరీకి ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదని అమిత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వాసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**- తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.**
**- ఆసుపత్రిలో డాక్టర్లు అందిస్తున్న చికిత్స పై రోగులను అడిగి తెలుసుకున్నారు.20 లక్షల విలువచేసే పాలు డిజిటల్ పరికరాలు ప్రారంభించారు.**
**- ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దంత వైద్యం చేయించుకున్నారు.**
**ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం**



**- ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డాక్టర్ లపై ఎమ్మెల్యే హాట్ కామెంట్స్ చేశారు.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

భగవంతుడు దగ్గరికి వెళ్లి దండం పెడితే మన సమస్య తీరుతుందో లేదో తెలియదు గాని డాక్టర్ దగ్గరకు వెళ్ళితే తీరుతుందని,అందుకే వైద్యో నారాయణో హరి అంటారని అన్నారు.ప్రభుత్వ హాస్పిటల్ లో డాక్టర్ అంటే డ్యూటీ చేసే చాలా మంది డాక్టర్లు కు తెలియదు. వచ్చామా,జీతం తీసుకున్నామా, వెళ్ళిపోయామా అనే ధోరణి రణిలోని ప్రభుత్వ డాక్టర్లు ఉన్నారు.తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి వచ్చే రోగులను డాక్టర్లు చిరాకు పడుతున్నారు అని వారికి ట్రీట్మెంట్ సరిగ్గా చేయడం లేదు అని నా దృష్టి కి వచ్చింది.అంతే కాకుండా ముగ్గురు డాక్టర్ లు హాస్పిటల్ సమయం లో వైద్యం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారు అని విమర్శించారు.
ప్రభుత్వం జీతం తీసుకుంటు బయట హాస్పిటల్ కి వెళ్లి వైద్యం చేయడం, రోగులకు వైద్యం చేయకుండా, ఒకరి ఛాంబర్ లో కి మరొకరు వెళ్లి మాట్లాడుకోవడం, రోగుల పై చిరాకు పడడం వంటి ఫిర్యాదులు నా దృష్టికి వచ్చాయన్నారు.పేదలకు వైద్యం చేయడం ఇష్టం లేకపోతే ఉద్యోగం మానేయవచ్చన్నారు.ప్రైవేట్ హాస్పిటల్ లో పనిచేసుకోవచ్చని హితవు పలికారు.ఈ సమస్యలను సరిదిద్దుకొని పేద ప్రజలకు వైద్యం అందించాలని ముగ్గురు డాక్టర్లకు వార్నింగ్ ఇచ్చారు.హాస్పిటల్లో ఎవరి డ్యూటీ వాళ్ళే చేయాలని, ఒకరి డ్యూటీ మరొకరు చేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏరియా హాస్పిటల్ లో హార్ట్ ఆపరేషన్లు చేయించి ఎమ్మెల్యేగా దిగాలని నా కోరిక అని,ఈ హాస్పిటల్ ని ఉస్మానియా ఆసుపత్రి లాగా తీర్చిదిద్దాలనేది నా ఆకాంక్ష అంటూ డాక్టర్లకు తెలిపారు.ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని మీ అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేయిస్తానని, అందుకు అందరు సహకారం, తోడ్పాటు కావాలని ఎమ్మెల్యే కోరారు.

# మహిళా సాధికారతకు పోరాడిన సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు



శ్రీకాళహస్తి, మార్చ్ 10,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి పట్టణం 18వ వార్డు పరిధిలోని పూసల వీధి కూడలిలో క్రాంతిజ్యోతి శ్రీమతి సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి మాట్లాడుతూ మహిళా హక్కుల సాధనకు విద్యనే ప్రధాన ఆయుధంగా భావించి మహిళా సాధికారత కోసం పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలేతో కలిసి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.బాల్యవివాహాల నిర్మూలన, వితంతువు పునర్వివాహాలకు ప్రోత్సాహం, మహిళల విద్యాభివృద్ధి కోసం పూలే దంపతులు చేసిన పోరాటం భారత సమాజానికి మార్గదర్శకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు యం.సుబ్బయ్య, పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, షేక్ మహబూబ్ బాషా, వెంకటరమణ, చిల్లకూరు మణి, సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్, సోంపల్లి మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ ల పూర్తికి యాక్షన్ ప్లాన్ సిద్ధం

**- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టీకరణ**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.పోలవరం ప్రాజెక్టు అథారిటీ కమిటీ అధికారులతో సోమవారం మంత్రి ప్రాజెక్టు పనులను పరిశీలించారు.ఇరిగేషన్ రంగానికి గతంలోనూ, ఇప్పుడు పెద్ద పీట వేసి, అవి పూర్తి అయ్యేలా చేసింది, చేస్తోంది కూటమి ప్రభుత్వమేనని అన్నారు.ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా, రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని సీఎం చంద్రబాబు సూచించారని తెలిపారు.గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం అయిందని,నాణ్యత,ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. సి డబ్ల్యూ సి డిజైన్స్ ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ప్యానల్ ఎక్స్పర్ట్స్ సూచనలు పాటిస్తూ పనులు చేస్తున్నామన్నారు.పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ప్రతిరోజు డిజైన్ల ప్రకారం జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తుందని తెలిపారు.ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి లియజేస్తున్నామన్నారు. కొత్త డయాఫ్రం



వాల్ 1372 మీటర్లకు గానూ, 1300 మీటర్లు నేటికి పూర్తయిందని, ఈ నెలాఖరుకు మొత్తం పూర్తవుతుందని తెలిపారు.ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచేలా వైబ్రో కాంప్యాక్షన్ పనులు పూర్తి చేశామన్నారు.ఈఏడాది జూన్ నాటికి కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు పూర్తి చేస్తామని,నాడు 2016లో నిర్వాసితులకు 700 కోట్ల పరిహారం అందించిన చంద్రబాబే, మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు దపాలుగా 1900 కోట్లు పంపిణీ చేశారని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణం పై సూచనలు, సలహాలు... విమర్శలు, డిమాండ్స్ వస్తున్న వాటిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తామన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత పై గాని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారంతో 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, అప్పటికే 41.75కాంటూరు నిర్వాసితులకు పూర్తిగా పరిహారం చెల్లించాలని కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు.

# నల్ల గంగమ్మ జాతరకు సారి సమర్పించిన దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

శ్రీకాళహస్తి,మార్చ్ 10,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



శ్రీకాళహస్తి పట్టణంలోని బహుదూర్‌పేటలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి జాతర మహోత్సవానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సారీ సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనవాయితీగా నిర్వహించే ఈ జాతరకు సారీ సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధితో పాటు అనుబంధ ఆలయాలు, పరిసర ప్రాంతాల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్ల గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కంటా రమేష్, ఆలయ బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# టమోటా లోడ్‌తో వెళ్తూ ప్రమాదానికి గురైన టాటా ఏస్

తొట్టంబేడు, మార్చ్ 10,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం మల్లిగుంట రోడ్డు సమీపంలోని ఎన్‌హెచ్--7 జాతీయ రహదారిపై మంగళవారం టాటా ఏస్ వాహనం టమోటా లోడ్‌తో వెళ్తూ ప్రమాదానికి గురైంది. టమోటా లోడ్‌తో వెళుతున్న సమయంలో వాహనం టైరు పగిలిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం రోడ్డుపై బోల్తా పడింది.వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ఉండగా, అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే ముగ్గురూ వాహనం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.ఘటన కారణంగా కొద్దిసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు వెంటనే స్పందించి వాహనాన్ని రోడ్డుపక్కకు తరలించడంతో రాకపోకలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

